# తెలంగాణ పాలన అద్భుతం

**దేశానికే దిక్సూచిగా ఉంది ● భావి ప్రధాని సీఎం కేసీఆర్ ● మా రాష్ట్రంలో పార్టీని విస్తరిస్తాం ● కాంగ్రెస్, బీజేపీ మోసకారి పార్టీలు**
**అరుణాచల్ ప్రదేశ్ మాజీ ఎమ్మెల్యేల వెల్లడి ● మంత్రి గంగుల కమలాకర్, వినోద్‌కుమార్‌ను కలిసిన బృందం**

కరీంనగర్, అక్టోబర్ 12 (నమస్తే తెలంగాణ)/ కలెక్టరేట్/ కార్పొరేషన్ : తెలంగాణలో పాలన అద్భుతంగా ఉందని, ఈ రాష్ట్రం దేశానికే దిక్సూచిగా ఉందని అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన మాజీ ఎమ్మెల్యేలు ప్రశంసించారు. పీపుల్స్‌పార్టీ ఆఫ్ అరుణాచల్ ప్రదేశ్ పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యేలు తాయ్ తడాప్, టికీ కామా, బిరిజాయ్, దెబియా తారా, చావ్ షోటికే హాపాక్, పీకే పులు, తదితరులు తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధిని పరిశీలించేందుకు గురువారం కరీంనగర్ జిల్లాకు వచ్చారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో జరిగిన అభివృద్ధి పనులను పరిశీలించారు. నగరంలోని కేబుల్ బ్రిడ్జిని సందర్శించడంతోపాటు మానేరు రివర్ ఫ్రంట్ పనులను పరిశీలించారు. ఐటీ టవర్‌ను చూసి ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. ఇస్కాన్ టెంపుల్.. టీటీడీ టెంపుల్స్ నిర్మాణ ప్రతిపాదిత స్థలాలను చూసి పులకించిపోయారు. నగరంలోని సుందరమైన రోడ్లు.. రాత్రి వేళ సెంట్రల్ లైటింగ్‌తో జిగేల్‌మంటున్న నగరాన్ని చూసి ఆనందం వ్యక్తం చేశారు. రాత్రి రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌర సరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌ను వేర్వేరుగా కలిశారు. ఈ సందర్భంగా వారి నివాసాల్లో మాట్లాడారు. తెలంగాణ సీఎం కేసీఆర్ భవిష్యత్‌లో భారత ప్రధాని కావడం తథ్యమని జోస్యం చెప్పారు. ఇక్కడ జరిగిన అభివృద్ధి దేశ ప్రజలను ఆకర్షిస్తున్నదని స్పష్టం చేశారు. తెలంగాణ మోడల్ అభివృద్ధి దేశవ్యాప్తంగా కోరుకుంటున్న నేపథ్యంలో తాము బీఆర్‌ఎస్‌లో చేరేందుకు ఆసక్తి కనబరుస్తున్నట్లు వెల్లడించారు. దశాబ్దాల తరబడి అనేక సమస్యలతో సతమతమవుతున్న అరుణాచల్‌ప్రదేశ్ ప్రజలను కాంగ్రెస్, బీజేపీ మోసం చేస్తున్నాయని మండిపడ్డారు. ఈ రెండు పార్టీలు ఇతర రాజకీయ పార్టీలను తమ రాష్ట్రంలో ఎదగనీయడం లేదని, గెలిచిన అభ్యర్థులను కొనుగోలు చేస్తూ పరిపాలన సాగిస్తున్నాయని ఆరోపించారు. సామాన్యుల పొట్టకొడుతున్న దుష్ట ప్రభుత్వాల ఆట కట్టిస్తూ, దేశాన్ని పాలించే సత్తా కేసీఆర్‌కే ఉందనే భావనతో, తాము బీఆర్‌ఎస్‌లో చేరేందుకు సిద్ధమవుతున్నామని వెల్లడించారు. పార్టీని అరుణాచల్ ప్రదేశ్‌లో పూర్తిస్థాయిలో విస్తరించి, 2024 ఏప్రిల్‌లో రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నుంచి పోటీ చేస్తామని స్పష్టం చేశారు. మొత్తం 60 అసెంబ్లీ స్థానాలకు మెజారిటీ సెగ్మెంట్లు గెలుపొంది, బీఆర్‌ఎస్ పాలనను తీసుకువస్తామని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీజేపీలకు ప్రత్యామ్నాయంగా వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సత్తా చాటేందుకు తమ వంతు కృషి చేయనున్నట్లు చెప్పారు. తెలంగాణలో ప్రధానంగా విద్య, వైద్య రంగాలు ఎంతగానో అభివృద్ధి చెందాయని, తద్వారా పేద, మధ్య తరగతి ప్రజల జీవన ప్రమాణాలు మెరుగవుతున్నాయన్నారు. ఈశాన్య రాష్ట్రాల్లో అత్యంత వెనుకబాటుకు గురైన అరుణాచల్‌ప్రదేశ్ తెలంగాణ రోల్ మోడల్‌ను ఆదర్శంగా తీసుకుంటే, అతి తక్కువ సమయంలో అత్యంత ఎక్కువ అభివృద్ధి చెందుతుందనే భావనతో తాము బీఆర్‌ఎస్‌ను తమ రాష్ట్రంలో పరిచయం చేయబోతున్నట్లు ప్రకటించారు. పదేళ్లలో కరీంనగర్‌లో జరిగిన అభివృద్ధిని చూస్తే ముచ్చటేస్తుందన్నారు. ఇంత అభివృద్ధిని ఊహించలేక పోయామన్నారు.


మంత్రి గంగులకు పుష్పగుచ్ఛం అందిస్తున్న అరుణాచల్ ప్రదేశ్ మాజీ ఎమ్మెల్యేలు, చిత్రంలో వినోద్‌కుమార్

**అభివృద్ధే బీఆర్‌ఎస్ విధానం : వినోద్ కుమార్**

దశాబ్దాల పాలనతో దేశాన్ని అథోగతి పాలు చేసిన కాంగ్రెస్, బీజేపీ పాలనకు చరమగీతం పాడుతూ, అభివృద్ధిని కళ్లెదుట సాక్షాత్కరింపజేయడమే బీఆర్‌ఎస్ పార్టీ ఆలోచన విధానమని అని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అరుణాచల్ ప్రదేశ్ మాజీ ఎమ్మెల్యేలతో స్పష్టం చేశారు. ఉమ్మడి పాలనలో వివక్షకు గురైన తెలంగాణ స్వరాష్ట్రంలో అనతి కాలంలోనే ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షించేలా జరిగిన అభివృద్ధి ఇతర రాష్ట్రాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చొరవతో తెలంగాణ మోడల్ దేశం పురోగతి చెందేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో జరిగిన అభివృద్ధే బీఆర్‌ఎస్‌ను దేశవ్యాప్తంగా విస్తరింపజేస్తోందన్నారు. సీమాంధ్రుల పాలనలో నిత్యం కల్లోలమయమైన తెలంగాణ, తొమ్మిదేళ్లుగా కొనసాగుతున్న నిరంతర అభివృద్ధితో ఆదర్శంగా మారిందని, దీనిని గమనిస్తున్న ఇతర రాష్ట్రాల్లోని ప్రజలు బీఆర్‌ఎస్‌ను ఆహ్వానిస్తున్నారని చెప్పారు. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో ఒరిస్సా, ఆంధ్రప్రదేశ్, అరుణాచల్‌ప్రదేశ్‌లో శాసనసభ ఎన్నికలు జరుగనున్నాయని, ఆయా రాష్ట్రాల్లో పోటీ చేసే అభ్యర్థులపై దృష్టి సారించనున్నట్లు వెల్లడించారు.

**మంత్రి గంగులకు అభినందనలు**

ఈ సందర్భంగా కరీంనగర్ సిటీలో జరిగిన అభివృద్ధిని పరిశీలించిన అరుణాచల్ ప్రదేశ్ మాజీ ఎమ్మెల్యేలు తాయ్ తడాప్, టెకీ కామా, బిరిజాయ్, దెబియా తారా, చావ్ షోటికే హాపాక్, పికె పులు మంత్రి గంగుల కమలాకర్‌ను కలిసి అభినందించారు. ఇక్కడ జరుగుతున్న అభివృద్ధిని అడిగి తెలుసుకున్నారు. చాలా బాగా అభివృద్ధి చేశారని, ఇంత బాగా పాలన అందిస్తున్న సీఎం కేసీఆర్‌ను, మంత్రులను ఈ సందర్భంగా అరుణాచల్ ప్రదేశ్ మాజీ ఎమ్మెల్యేలు అభినందించారు. మెట్రో సిటీల్లో రెండు, మూడు మెడికల్ కాలేజీలు ఉంటాయని, కానీ కరీంనగర్‌లో ఇప్పటికే రెండు ప్రైవేటు మెడికల్ కాలేజీలు ఉన్నా ప్రభుత్వ మెడికల్ కాలేజీ తెచ్చిన ఘనత గంగుల కమలాకర్‌దని కొనియాడారు. చేయాలనే తపన ఉంటే ఏదైనా సాధ్యపడుతుందని, మంచి కమిట్‌మెంట్ ఉన్న నాయకుడు అని అభినందించారు. ఇలాంటి నాయకుడు ఉండడం.. కరీంనగర్ చేసుకున్న అదృష్టమన్నారు. గంగుల నాయకత్వంలో కరీంనగర్ మరింత గొప్ప నగరంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. పని చేసే నాయకుడ్నే ప్రజలు ఆదరిస్తారని, రాబోయే ఎన్నికల్లో వరుసగా నాలుగోసారి గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో జరుగుతున్న పాలన, అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి మంత్రి గంగుల వారికి వివరించారు. అనంతరం వారిని మంత్రి గంగుల సన్మానించారు.

# నేను మీ బిడ్డను.. ఆశీర్వదించండి

- **నిత్యం అందుబాటులో ఉంటా.. మరింత అభివృద్ధి చేస్తా**
- **చొప్పదండి బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రవిశంకర్**

కొడిమ్యాల, అక్టోబర్ 12: 'నేను మీ బిడ్డను. మీ కష్టాలు, కన్నీళ్లు తెలిసిన బిడ్డను. స్థానికంగానే ఉంటా. ఆపదొస్తే ఆదుకుంటా. మరోసారి ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించండి. నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని' చొప్పదండి బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రవిశంకర్ కోరారు. కొడిమ్యాల మండలంలో రెండో రోజూ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. తుర్కాశినగర్, చెప్యాల, రామకిష్టాపూర్, కొండాపూర్, బోల్లెన్ చెరువు, నాచుపల్లి, కొడిమ్యాల బస్టాండ్, అంగడి బజార్‌లో ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ రాష్ట్రాన్ని, దేశాన్ని 60 ఏండ్ల పాటు పాలించిన కాంగ్రెస్, బీజేపీలు ప్రజల కోసం చేసింది శూన్యమని, అధికారంలో ఉన్నన్ని రోజులు పనులు చేయనోళ్లు.. ఇప్పుడు చేస్తరా.. ఆలోచించాలని సూచించారు. ఎన్నికల ముందు మాత్రమే కనిపించే నాయకుల మాటలు నమ్మితే, మోసపోతామన్నారు. ఈ 45 రోజులు ఇతర పార్టీల నాయకులు చెప్పే మాయ మాటలు నమ్మకుండా మనసు నిమ్మలం చేసుకొని అభివృద్ధి చేసే బిడ్డను గెలిపించాలన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కృషితో సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే తెలంగాణ ముందంజలో ఉందన్నారు. గతంలో ఈ ప్రాంతం ఎలా ఉండేదో ఒకసారి ఆలోచించాలని, ఉపాధి లేక ఎంతో మంది ముంబై, భీవండి వలస వెళ్లిన రోజులు ఇంకా కండ్ల ముందే కదలాడుతున్నాయని చెప్పారు. స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ ప్రాజెక్టులు నిర్మించి, చెరువులు బాగుచేయడంతో వ్యవసాయం పండుగలా మారిందని, వలస పోయిన రైతులు సొంత గ్రామాలకు తిరిగి వచ్చి బంగారు పంటలు పండిస్తున్నారని పేర్కొన్నారు. రైతులకు అనేక పథకాలతో అండగా నిలుస్తున్న ప్రభుత్వం దేశంలో ఒక్క బీఆర్‌ఎస్ మాత్రమేనని ఉద్ఘాటించారు.


వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవిశంకర్


హుజూరాబాద్ 7వ వార్డులో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి

# ఎమ్మెల్యేగా ఒక్క అవకాశం ఇవ్వండి

- **నియోజకవర్గాన్ని రూ. వెయ్యి కోట్లతో అభివృద్ధి చేసి చూపిస్తా**
- **బీఆర్‌ఎస్ హుజూరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి**

హుజూరాబాద్‌టౌన్ అక్టోబర్12: ఒక్కసారి ఎమ్మెల్యేగా తనకు అవకాశం ఇవ్వాలని, హుజూరాబాద్ నియోజకవర్గాన్ని రూ.వెయ్యి కోట్ల నిధులు తెచ్చి అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానని మండలి విప్, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం రాత్రి హుజూరాబాద్ మున్సిపల్ పరిధిలోని ఐదు, ఆరు, ఏడు, ఎనిమిది వార్డుల్లో బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రతి కార్యకర్త బీఆర్‌ఎస్ గెలుపునకు కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యేగా గెలిపిస్తే హుజూరాబాద్‌ను మరో సిద్దిపేట, సిరిసిల్ల మాదిరిగా అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. పలుమార్లు ఈటలకు అవకాశం ఇచ్చినా నియోజకవర్గాన్ని ఏమాత్రం అభివృద్ధి చేయలేదని విమర్శించారు. తనను ఒక్కసారి గెలిపిస్తే అభివృద్ధి అంటే ఏంటో నియోజకవర్గ ప్రజలకు చేసి చూపిస్తానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధికాశ్రీనివాస్, వైస్ చైర్‌పర్సన్ కొలిపాక నిర్మల, బీఆర్‌ఎస్ పార్టీ పట్టణాధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, ఆయా వార్డుల కౌన్సిలర్లు అపరాజ ముత్యంరాజు, తాళ్లపల్లి శ్రీనివాస్, మక్కపెల్లి కుమార్, బీ శివకుమార్, మాజీ కౌన్సిలర్ కొయ్యడ కమలాకర్, మాజీ ఎంపీటీసీ కొయ్యడ శ్రీదేవి, వార్డు కమిటీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


# గంగుల, వినోద్‌కు కృతజ్ఞతలు

తెలంగాణ చౌక్, అక్టోబర్ 12 : యాదవ సంఘం భవన మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేసిన మంత్రి గంగుల కమలాకర్, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ చిత్రపటాలకు అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో గురువారం పాలాభిషేకం చేశారు. యాదవ కమ్యూనిటీ హాల్ ఆధునీకరణ, మరమ్మతుల కోసం ఇటీవల మంత్రి గంగుల, బోయినపల్లి వినోద్‌కుమార్ రూ.10 లక్షల ప్రోసీడింగ్ అందజేయగా తెలంగాణ చౌక్‌లో పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం సంఘం అధ్యక్షుడు మంచాల పోషన్న మాట్లాడుతూ, యాదవ సంఘ భవనానికి అడగగానే నిధులు మంజూరు చేసి తమ ఉదారతను చాటుకున్న మంత్రి గంగుల కమలాకర్, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సందవేని గీతాంజలి, వైజయంతి, మంచాల రవి, సందబోయిన రవి తదితరులు పాల్గొన్నారు.


ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

# సీఎం సభకు తరలిరావాలి

**చిగురుమామిడి మండలంలో బీఆర్‌ఎస్ నాయకుల ఇంటింటి ప్రచారం**


ఉల్లంపల్లిలో మాట్లాడుతున్న ఎంపీపీ కొత్త వినీతాశ్రీనివాస్‌రెడ్డి

చిగురుమామిడి, అక్టోబర్ 12: ఈ నెల 15న హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలో జరిగే సీఎం కేసీఆర్ ప్రజాఆశీర్వాద సభకు ప్రజలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. అన్ని గ్రామాలకు మండల ఇన్‌చార్జిలను నియమించారు. అందులో భాగంగా ఉల్లంపల్లిలో ఎంపీపీ కొత్త వినీతా శ్రీనివాస్ రెడ్డి సర్పంచ్ చెప్యాల మమతతో కలిసి ఇంటింటికీ వెళ్లి సభకు తరలిరావాలని ప్రజలను కోరారు. సుందరగిరిలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మామిడి అంజయ్య, గునుకులపల్లిలో వైస్ ఎంపీపీ బేతి రాజిరెడ్డి, బొమ్మనపల్లిలో బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు కొత్త శ్రీనివాస్ రెడ్డి, చిగురుమామిడిలో సింగిల్ విండో చైర్మన్ జంగా వెంకటరమణారెడ్డి, ఓగులాపూర్‌లో రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు సాంబారి కొమురయ్య, పీచుపల్లిలో మండల ఆర్గనైజింగ్ కార్యదర్శి చెప్యాల శ్రీనివాస్ గడపగడపకూ వెళ్లి సభకు రావాలని ప్రజలను కోరారు. అలాగే గాగిరెడ్డిపల్లిలో బీఆర్‌ఎస్ మహిళా మండలాధ్యక్షురాలు అందె సుజాత, సర్పంచ్ సన్నిల్ల వెంకటేశంతో కలిసి ఇంటింటికీ తిరిగి మహిళలకు బొట్టు పెట్టి సభకు ఆహ్వానించారు.